ఆయన అంటే ఒక మంచి అభిప్రాయమే కలిగింది శశాంకకు. క్రమశిక్షణతో, క్రమబద్ధమైన ఆలోచనలతో జీవించే మనిషిగా కనిపిస్తాడు. అరవై ఏళ్ళు పైబడ్డా బక్కపలుచగా, ఇనుప చువ్వలా, చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటాడు. క్రమబద్ధంగా జీవించేవాళ్ళలో గాని అంత ఆరోగ్యం కనిపించదు.

ఆ వేళ నిర్మలను చేసుకొంటే పాతిక వేల కట్నం సమర్పించుకొంటానన్న పెద్దమనిషి, చూడడానికి గాంధీమహాత్ముడంత గోచీ, అంత నిరాడంబర ప్రియుడూ!

ఇంటికివచ్చి టీ తీసుకొని, కాస్సేపు విశ్రాంతిగా కూర్చొని స్నానానికివెళ్ళి వచ్చేంతలో నిన్న నూతిదగ్గర నీళ్ళు తోడుకొంటున్నావిడా, మరొక యువకుడూ అలివేలమ్మతో సంబంధం గురించే ఏమిటో ముచ్చటిస్తున్నారు.

అతడు అలివేలమ్మ రెండో బావగారి కొడుకు. ఆమె అతడి భార్యానూ, బావగారు కొన్నేళ్ళ క్రిందట దివంగతులయ్యారు. ఈయన ఒక్కడే కొడుకు. కొడుకూ కోడలితో సవేమిరా పడని అత్తగారూ కూడా కాస్సేపటిలోవచ్చి ఇవతల కూర్చొన్న శశాంకవైపు తొంగి తొంగి చూస్తూంది. ఏమిటో గుసగుసలు పోతూంది. గ్రామీణ అమాయకత్వమంతా ఆవిడలో మూర్తీభవించి కనిపించింది శశాంకకు.



ఈ ఇంటి నానుకొనే ఉంటుంది వాళ్ళ ఇల్లు. ఇంటిముందు నుండేకాక పడిపోయిన పెరటిగోడనుండి కూడా మంచి నీళ్ళకూ దానికీ దీనికీ రాకపోకలు సాగుతుంటాయి. వాళ్ళకు అప్యాయతవచ్చినా వెల్లువలా వస్తుంది. కోపంవచ్చినా ఎందుకొచ్చిందో తెలియకుండా చిత్రంగా బిగదీసుకుపోతారు. మరికొన్నాళ్ళదాకా ముఖ చూపులూ, రాకపోకలూ బంద్ అయిపోతాయి. మళ్ళీ కొన్నాళ్ళకు ఏమీ జరగనట్టు మెల్లి మెల్లిగా రాకపోకలూ, అంతులేని ఆపేక్షలూ! అలివేలమ్మ మాత్రం ఇలాంటి విషయాలలో చాలా తెలివిగా వ్యవహరిస్తుంది. ఏది వచ్చినా పోయినా వాళ్ళవైపునుండే జరగాలిగాని ఆవిడమాత్రం చాలా నిర్లిప్తంగా ఊరుకొంటుంది.

అలివేలమ్మ మూడోబావగారు దత్తుపోయారు. చుట్టపుచూపుగా అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడాయన. అలివేలమ్మ పొలాలవీ పెద్దబావగారే సాగుబడి చేసి ధాన్యం ఇంటికి పంపుతుంటాడు. అదీ అలివేలమ్మ బలగం సంగతీ కుటుంబ పరిస్థితీ.

టిఫిన్ ప్రయత్నమేదీ చేయనివ్వలేదు విశ్వనాథ్. చప్పున వంట అయిపోతే తినేసి బస్సు కెళ్ళిపోతామని చెప్పి.

(సశేషం)





# పునస్సమాగమం - గోపీచంద్ -

ఇంట్లో తన భార్యను చూశాడు. తన కళ్ళతో చూశాడు. నిర్ఘాంతపోయి నుంచున్నాడు. నిజంగా తన భార్య లేచిపోయినప్పుడుకూడా అతను అంత షాక్ తినలేదు. అంతకుముందు లేచిపోవటం అంటే, తనేదో బ్రహ్మాండమయిన విషయం అనుకున్నాడుగాని, తనభార్య లేచిపోయిన తర్వాత అది అంత బ్రహ్మాండమైన విషయంగా అతనికి కనపడలేదు. క్రమక్రమేణా అతను బాధపడ్డమాట నిజమేగాని, ఆ క్షణం తనకి అంతా మామూలుగా కనపడ్డది. తరువాత అయినా స్నేహితుల ఓదార్పు మాటలూ, ఇతరుల లోకువ చూపులూ, అత్తన్ని ఎక్కువ కలవరపెట్టేవి. అవే లేకపోతే తరువాత కూడా తను బాధపడేవాడు కాదేమో! ఏదో కన్నవారింటికి వెళ్ళినట్లుగా మాత్రమే తను ఫీలయ్యేవాడు.

ఇప్పుడలాకాదు, తన భార్యను చూడగానే శరీరం జలదరించింది. నిజంగా తనకాళ్ళు వొణుకుతున్నై. తనజీవితంలో ఇటువంటి అనుభవం ఒక్కసారే జరిగింది. అది తనకు వివాహం అయిన మొదటిరోజుల్లోసంగతి. అంతకు ముందు అతనికి తన భార్యను తప్ప మరొకర్ని ప్రేమించవొస్తుందని తెలియదు. తనిభార్యకు వొక స్నేహితురాలుండేది. చక్కని చుక్క ఆపిల్ల. తన్ను

ప్రేమించింది. తను ఆపిల్లను ప్రేమించాడో లేదో తనకు ఈనాటికి తెలియదు. ఆమె వొకనాడు తనభార్య నిద్రపోతుండగా వొచ్చింది. తనే తలుపుతీశాడు.

"నిద్రపోతూవుంది..."

ఆ పిల్ల ముసిముసినవ్వులు వొలకబోసుకుంటూ లోపలకు వొచ్చింది. గదిలో తనభార్య నిద్రపోవటంచూచింది.

"మంచినీళ్ల కావాలా ?"

తను తలవూపాడు. గుటకవేశాడు. ఆపిల్ల మంచినీళ్ళకోసం వంటయింట్లోకి వెళ్ళింది. తనుకూడా వెళ్లాలి కాబోలు. వెళ్ళలేకపోయాడు. ఆ పిల్ల వంటయింటిలో కాసేపు ఆలస్యం చేసింది. చివరకు మంచినీళ్ల తెచ్చియిచ్చింది. తనుకూడా ఏదో వొకటి చెయ్యాలి కాబోలు. గ్లాసుతీసుకుంటూ వేళ్ళు తాకాడు. ఆ పిల్ల "పోదురూ" అన్నది. అప్పుడు తనకు ఇట్లాగే శరీరం జలదరించింది. గుండె కొట్టుకుంది. కాళ్ళు వొణికినై. అప్పటిలాగా ఇప్పుడూ ముచ్చెమటలు పోస్తున్నాయి.

నాలుగు సంవత్సరాల క్రితం లేచిపోయిన తనభార్య ఇప్పుడెందుకు వొచ్చింది? ఏ మొహంపెట్టుకువొచ్చింది? ఏమీ ఎరగనట్టు కూచుంది. కాలుమడిచి మోకాలుమీద బుగ్గను ఆన్చుకొని మరీ కూచుంది. తాను కాపురంచేసే రోజుల్లో తనమీద అలిగినప్పుడుగానీ, తనయిష్టం లేని పని ఏదన్నా జరిగినప్పుడుగాని ఇట్టాగే కూచునేది. ఎంత పిలిచినా పలికేది కాదు, ఏ మాటకీ బదులుచెప్పేది కాదు. అప్పుడు తను బ్రతిమాలేవాడు. ఎంత బ్రసమాలించుకునేదని! ఎప్పుడూ తమ పోట్లాట వొక విధంగానే రాజీ అయ్యేది. తరువాత తాను నవ్వేవాడు, ఆమె సిగ్గుపడేది...

అతనికి యేంచెయ్యాలో తోచలేదు. అక్కడనుంచి కదల్లేకపోయాడు. అకస్మాత్తుగా అదే పరిస్థితుల్లో ఇంకొకరైతే ఏంచేసేవారా అనే ఆలోచన వచ్చింది. తన్ని బయటకు ఈడ్చేవారు అనుకున్నాడు. తన్నటం, ఆమె గిలగిల తన్నుకుంటూ కాళ్ళావేళ్లాపడి బతిమాలుతుంటే నోటికివచ్చిన కూతలన్నీ కూస్తూ బరాబరా బయటకు లాగటం, మెట్లమీదనుంచి కిందకుతోసి టప్పునతలుపువేసుకోవటం — అదంతా వూహించుకుంటే మనస్సుకి బాగానేవుంది. కాని అంతపని చెయ్యటానికి తగినంత కోపం తనకు రాన్దే! నాలుగు సంవత్సరాల క్రితం జరిగిందానికి తనకిప్పుడు కోపం రమ్మన్నా రాదు. తను కోపాన్ని నెమరువెయ్యలేడు.

ఏంచెయ్యటం అనేది తరువాత ఆలోచిద్దాం. అసలు ఎందుకువొచ్చివుంటుంది? ఆమె తన్ను చూట్టంలేదుగద! సడలినలిగివుంది కాని అందంగా వుంది. కళ్లు మెరుస్తున్నాయి. అతిసుకుమారంగా వుంది. వెంటనే అతనిలో ఈర్ష్యరేగింది.



గొంతు సవరించుకున్నాడు., గుటకవేశాడు. వాడేమయ్యాడో, వాడిపేరు తలచుకోకూడదు. తీసుకువెళ్ళి నానా కష్టాలుపెట్టి వుంటాడు. రోజూ సాయంకాలం వొళ్లు విరగ్గొట్టి వుంటాడు. చితకపొడిచి వుంటాడు. రోగం కుదిరివుంటుంది. అప్పుడు తను జ్ఞాపకంవొచ్చివుంటాడు. ఆ బాధలు భరించలేక వొచ్చివుంటుంది. ఇప్పుడు మళ్ళీ తను కావలసివొచ్చాడు. తనకు అక్కర్లేదు అనుకున్నప్పుడు విడిచిపెట్టటం, కావాలనుకున్నప్పుడు రావటం. ఛీ!

"ఎందుకొచ్చావ్!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అట్టాగేకూర్చునివుంది. అతని ప్రశ్నను వినిపించుకోలేదు...అతని ఆలోచనలను ఊహిస్తూవుంది. తన భర్త ఏదో తన్ను నానా కష్టాలుపడీ భరించలేక రక్షణకోసంవొచ్చాడనుకుంటున్నాడు. పాపం తనకేం కష్టం? నాలుగు సంవత్సరాలూ నాలుగు మధురక్షణాలుగా గడిచిపోతేనూ! ఏమాటకామాట చెప్పుకోవాలి. కామరాజుతో లేచిపోయినందుకు తానీనాటికీ పశ్చాత్తాప పడటంలేదు. పశ్చాత్తాప పడటం ఎందుకు? — తన్నీనాటికీ నిక్షేపంలా చూస్తున్నాడు. అతనితో కలిసి తాను ఈ నాలుగేళ్ళల్లో ఎన్ని సుఖాలు అనుభవించింది!! ఎంత జీవితాన్ని రుచిచూచింది! ఎటువంటి అనుభవాలు!! నిజంగా పదిజన్మలకు సరిపడా ఈ నాలుగేళ్ళలోనూ జీవితం అనుభవించిం... ఎందరెన్ని అన్నా తన హృదయంలో భద్రంగా దాచుకున్న ఈ అనుభవాన్ని మాత్రం ఎవ్వరూ తీసివెయ్యలేరు. చెపితే నమ్మరుగాని ఇంట్లో కూర్చున్నప్పటినాటికంటే ఈనాడే తాను మంచి మనిషి. ఇప్పుడు తనకు ప్రపంచంమీద కొండంత సానుభూతి వుంది. ఆనాడు తాను పైకి ఎంత కనపడనివ్వక పోయినా, నత హృదయంనిండా ఈర్ష్యే వుండేది. ప్రపంచాన్ని ప్రేమించడం నేర్పింది తన అనుభవం తనభర్తనుచూడాలని తనకు ఎందుకు బుద్ధిపుట్టాలి? ఎట్లావున్నాడో పాపం చూద్దామనేగదా...ఆయన అనరానిమాటలుఅనే అవకాశంవుందనితనకు తెలుసు. ధర్మబోధచేసి తనని నీచంగా చూడవొచ్చని తనకుతెలుసు. బయటకు గెంటించ వచ్చునితనకుతెలుసు. అయినా వొచ్చింది ఎందుకంటే ఆయన ఏంచేసినా తాను మన్నించగలదు. "పాపం" అనుకొని వూరుకోగలదు తనలో ఇంత ఔదార్యంవుందని తనకు నిజంగా లేచిపోయిన తర్వాతగాని తెలియలేదు ... పాపం తన భర్తకేం తెలుసు? వొట్టి అర్భకుడు. ఆయనకు అనుభవంతక్కువ. అందుకని బాధలు ఎక్కువ...పాపం!—

ఎంతసేపటికి అతని ప్రశ్నకు జవాబు రాలేదు. జవాబుకోసం చూశాడు. చూశాడు ... మాట్లాడదేం? ఎందుకొచ్చింది? పోయిందిపోక మళ్ళీ ఎందుకొచ్చింది. జరిగింది జరగ్గా తానీ నాలు

గేళ్ళల్లో ఎల్లాగో జీవితం సరిపెట్టుకున్నాడు. తనభార్య ఉన్నప్పుడువున్న వంటకత్తే వండిపెడుతూ వుంది. ఇల్లు చూస్తూవుంది. కాలం దొర్లిపోతూవుంది. వొకరకంగా ఈ జీవితానికి అలవాటుపడిపోయాడు. ఎప్పుడోగాని తన భార్య సంగతి జ్ఞాపకంవొచ్చేదికాదు. వంటకత్తె అప్పుడప్పుడు ఆ విషయం ఎత్తటానికి ప్రయత్నించేదిగాని, తాను వినేవాడు కాదు. ఈ విధంగా జరిగిపోతున్న జీవితంలోకి మళ్ళీ ఎక్కడనుంచి వొచ్చిపడిందో పడింది — తన జీవితం కెలకటానికి! తనంటే మొదటినుంచీ అలుసే. ఇప్పుడూ అంతే. ఎంత అలుసు కాకపోతే ఇట్లా వొస్తుంది. తనే తన భార్యస్థితిలో వుంటే ఈ పనిచేసేవాడూ? ఈపని చెయ్యాల్సి వచ్చినప్పుడు ఆత్మహత్య చేసుకునేవాడు...

"సిగ్గులేదూ?" అని అడిగాడు.

ఈ ప్రశ్నకు ఆమె హఠాత్తుగా తలపైకెత్తి చూసింది. సరాసరి అతని కళ్ళలోకి చూసింది. ఆ చూపులకు అతను తట్టుకోలేకపోయాడు. తల తిప్పేసుకున్నాడు. 'పాపం...' అనుకొని జాలి పడింది. ఆమె అదే మనిషి...మార్పేమీ లేదు. అప్పటికంటె ఇంకా లోపలకు కుంచుకుపోయాడు. ఇంకా ప్రపంచానికి దూరం అయ్యాడు. తనదృష్టి విశాలం అవటంవల్ల అతనితో కాపరంచేసిన నాటికంటే, ఈనాడు తనకు బాగా అర్థం అవుతున్నాడు. తను సిగ్గుపడాలట? ఎందుకో? చూడాలని వచ్చినందుకు కాబోలు! చూడాలనే బుద్ధి కలగటంకూడా తప్పే? తనకు భర్తనుచూడాలని చాలా రోజులనుంచీ అనిపిస్తూంది–పాపం. ఏం చేస్తున్నారో, అనిపించేది. చెబితేనమ్మరుగాని ఆయన్ని తలుచుకున్నప్పుడు, అప్పుడప్పుడూ కళ్ళుకూడా చెమర్చేవి. దీనికి కారణం భర్తమీద తనకున్న ప్రేమకాదు; కామరాజుమీద అసంతృప్తీ కాదు. ఎందుకో తనకే తెలియదు ... నిజంగా కారణం తెలియకుండానే చూడకుండా వుండలేకపోయింది. వొచ్చింది. పాపం నల్లబడిపోయారు. చిక్కి సగమయ్యారు. అనవసరంగా దిగులుపడి బాధను తన చుట్టూ నిర్మించుకున్నారు కాబోలు. పాపం తను అనుకున్నట్టు జరగింది — వొట్టి అమాయకులు.

అతను ఆలోచించాడు. డబ్బుకోసం వచ్చిందేమో? వంటిమీద నగలు ఉన్నట్టుగా గూడాలేవు. ఈ నాలుగు సంవత్సరాలనుంచీ అమ్ముకొని తిని వుంటారు. దరిద్రుడు ఆడదాన్ని అన్యాయంచేశాడు. ఆ డబ్బు అవగానే మళ్ళీ తనమీదకు తరిమాడు. లేవదీసుకు వెళ్ళేముందు ఏమి మాయమాటలు చెప్పాడో, ఇది అన్నీ నమ్మివుంటుంది. రోజూ రోజూ తనను గురించే మాట్లాడుకొని ఉండి ఉండాలి. వాడు ఏ మడిగేవాడో? తను ఏమి చెప్పేదో.

"నీకు బుద్ధిలేదు" అన్నాడు,

వాడు దరిద్రుడు. వెధవ, తెంపిఅనుకున్నాడు. మన బంగారం మంచిదవ్వాలిగాని కంసాలిని అని ఏం ప్రయోజనం అంటారుగాని, బంగారం దేముంది. కంసాలి ఎటు మలిపితే అటు మళ్లుతుంది వాడు జీవితంలోకి రాకముందు తాము చక్కగా జీవించలా? అసలు ఇంతకీ తను ఏమి లోటుచేశాడని ఇంతపనికి పూనుకుంది?

"లాభంలేదు" అనుకున్నది ఆమె.

ఈయనకు అర్థంకాలేదు. కామరాజుకీ ఈయనకూ వున్న భేదమే యిది. కామరాజు సానుభూతిని ఇట్టే అందుకుంటాడు. తీగెకుమల్లే అల్లుకుపోతాడు. ఈయన దగ్గరకు వొచ్చినవాళ్ళని ఇట్టే దూరం చేసుకుంటాడు. తనలో మొదటినుంచీ వున్న దుర్గుణమే యిది. అందరూ తన లాంటి వాళ్ళే అనుకుంటుంది. అందరూ ప్రతి విషయాన్నీ తనకు మల్లేనే అర్థం చేసుకుంటారనుకుంటుంది. తన దృష్టితో ఇతరులకు సహాయం చేయాలనుకుంటుంది. అందుకని అందరూ తన్ను అపార్థం చేసుకునేవాళ్ళే! అసలు రావటమే పొరపాటు. జరిగిందేదో జరిగింది. మళ్ళీ తనెందుకు రావాలి? ప్రపంచం తనకు కనపడ్డట్టే అందరికీ కనబడుతుందనుకోవటంలో వొస్తూవుంది, చిక్కు.

ఆమె నెమ్మదిగా లేచింది. హఠాత్తుగా వంటకత్తె వొచ్చింది. వంటకత్తెను చూసేటప్పటికి వొళ్లు మండింది. ఎందుకు రానిచ్చావు? అని అడిగాడు. నీకు తెలిసే రానిచ్చావు అన్నాడు. నీకు తెలిసే చేస్తున్నావు అన్నాడు. చస్తే చావనివ్వు నేను మాత్రం దమ్మిడీ ఇవ్వను అన్నాడు. భార్యవైపుతిరిగి "వెళ్లు–వెళ్ళిపో" అని గద్దించాడు. ఎక్కడలేని శక్తి తెచ్చుకొని గబగబా లోపలకు వెళ్ళాడు. కాసేపు అలాగే నిలబడిపోయింది ఆమె.

"ఎప్పుడొచ్చావమ్మా?" అని వంటకత్తె అడిగింది.

"వొస్తా" అని చెప్పి ఆమె లోపలకు వెళ్ళింది.

తన భర్త పడకగదిలో మంచంమీద పడుకొని కన్నీరు పెట్టుకోవడంచూసింది. ఆపుకోలేకపోయింది. నెమ్మదిగా చెంతకు జేరింది.

"ఏమండీ?"

అతను మాటాడలేదు.

"మిమ్మల్నే..."

అతను మాట్లాడలేదు.

వీపు నిమురుతూ, "వొంట్లో బాగా లేదా?" అని అడిగింది. అతను హఠాత్తుగా భార్యని కావలించుకొని "లేదు" అని అవురుమన్నాడు. భార్య వొళ్లో తల పెట్టుకొని, మొహం చేతుల్తో కప్పుకొని "నన్ను ఎందుకు విడిచి పెట్టావు?" అని రోదించాడు...